# కాశ్మీర్: ...ఎన్ని కలలో?







● కె.బాలగోపాల్

**మొరార్జీ దేశాయిని దేశంలో ఎక్కడా పెద్దగా గౌరవంగా తలచుకోరు. ప్రకృతి చికిత్స గురించి ఆయనకు ఉన్న అసాధారణమైన అభిప్రాయాలు వినా వేరే ఏదీ ఆయన గురించి మనకు జ్ఞాపకం ఉండకపోవచ్చు. మొరార్జీ పేరును గౌరవ పూర్వకంగా జ్ఞాపకం చేసుకునే ఒకే ఒక ప్రాంతం కాశ్మీరం.**

**1977లో** ఆయన దేశ ప్రధాన మంత్రి అయిన తరువాత కాశ్మీర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నిక ఒక్కటే ఈ 55 సంవత్సరాల స్వతంత్ర భారత చరిత్రలో కాశ్మీర్‌లో స్వేచ్ఛగా, న్యాయంగా జరిగిన ఎన్నిక అని కాశ్మీరీలు అంటారు. ఇప్పుడు ఈ సంవత్సరం జరిగిన ఎన్నికను రెండవ స్వేచ్ఛాయుతమైన ఎన్నికగా కాశ్మీరీలు చాలా వరకు గుర్తిస్తున్నారు. అయితే దీనికి వాజ్‌పేయిని కాక ప్రధాన ఎన్నికల కమిషనర్ లింగ్‌డో గారిని వారు అభినందిస్తున్నారు.

తప్పుడు పనులు ఎట్టి పరిస్థితిలోనూ చేయకూడదన్న గాంధేయవాద 'చాదస్తం'వల్ల ఆనాడు మొరార్జీ అప్పటిదాకా నెహ్రూ కుటుంబం నెలకొల్పిన ఆనవాయితీని తప్పించి ఆ రాష్ట్ర ప్రజలకు తమ ఇష్టం వచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే స్వేచ్ఛ ఉండాలని భావించాడు. లింగ్‌డో గారి మాటకొస్తే, తన వృత్తి నిర్వహణ నిష్పాక్షికంగా చేయాలని ఆయన గట్టిగా సంకల్పించిన విషయం గుజరాత్‌లోనే గమనించాము.

ఈ రెండు గుణాలనూ గౌరవించవలసిందే గానీ వాటిని ఆచరణలో పెట్టే అవకాశం ఆనాడు మొరార్జీకీ, ఈనాడు లింగ్‌డోకూ కలగడానికి వేరే కారణాలు కూడా ఉన్నాయని గుర్తించడం అవసరం. 1977 నాటికి 'కాశ్మీర్ సింహం' షేక్ అబ్దుల్లా బాగా మెత్తపడ్డాడు. 1953 నుండి 1975 మధ్యకాలంలో మొత్తం 15 సంత్సరాలు షేక్ అబ్దుల్లా జైలులో ఉన్నాడు. అతని మీద నేరస్మృతి గుర్తించే ఏ నేరారోపణా లేదు. స్వేచ్ఛ ఇస్తే కాశ్మీరీ స్వయం ప్రతిపత్తి గురించి మాట్లాడతాడనే నెహ్రూ అతన్ని జైలులో పెట్టాడు. మధ్య మధ్యలో అతనిని బయటకు రానిచ్చినప్పుడు కూడా కాశ్మీర్‌లో అడుగుపెట్టనివ్వలేదు. 1975 దాకా ఈ పరిస్థితే నడిచింది. చివరికి ఎమర్జెన్సీ చీకటి రోజులలో, అప్పటికే బాగా మెత్తబడిన షేక్ అబ్దుల్లాతో నెహ్రూ కుమార్తె ఒక ఒడంబడిక చేసుకుంది. అబ్దుల్లా ఇక మీదట కాశ్మీరీ స్వాతంత్ర్యాన్ని గురించి మాట్లాడకూడదనీ ఆ షరతు మీద అతని పౌరస్వేచ్ఛలతనికి తిరిగి ఇవ్వడం జరుగుతుందనీ ఆ ఒడంబడిక సారాంశం.

దానిమీద షేక్ అబ్దుల్లా సంతకం చేసి ఇంటికి తిరిగి వెళ్ళిన తరువాత జరిగిన మొదటి ఎన్నిక మొరార్జీ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగింది. అబ్దుల్లా లొంగిపోయాడు కాబట్టే అది స్వేచ్ఛగా జరగగలిగింది. అయినప్పటికీ మొరార్జీ ప్రభుత్వం కాక ఇందిరా ప్రభుత్వం అయివుంటే ఢిల్లీ పాలకులకు అనుకూలంగా మారిపోయిన షేక్ అబ్దుల్లాను ఎట్లాగైనా గెలిపించుకోవాలని చూద్దురేమో. అటువంటి బలహీనతకు లోనుకానందుకు మొరార్జీని అభినందించడంలో తప్పులేదు.

చెప్పుకోదగ్గ కొసమెరుపు ఏమిటంటే, మొట్టమొదటిసారిగా స్వేచ్ఛగా జరగనిచ్చిన ఆ ఎన్నికలలో షేక్ అబ్దుల్లా తిరుగులేని విజయం సాధించాడు. ఎన్నికైన రెండవ రోజు నుండి తన ఒప్పందం సంగతి మరచిపోయి కాశ్మీరీల స్వయం నిర్ణయాధికారం గురించి మాట్లాడసాగాడు. అసలే కాశ్మీరీలంటే చాలా అనుమానాలున్న మన పాలకులకు పాపం వారంటే పూర్తిగా విశ్వాసంపోయి ఉండాలి. ఆ తరువాత మళ్ళీ ఎప్పుడూ ఢిల్లీ విశ్వాసం సంపూర్ణంగా పొందిన

వారిని తప్ప మరొకరిని ఆ రాష్ట్రంలో గెలవనీయ లేదు. 1987లో షేక్ అబ్దుల్లా కొడుకు ఫరూక్ అబ్దుల్లా నాయకత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్‌ను కచ్చితమైన మెజారిటీతో ఓడించిన ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అభ్యర్థులు ఎంఎల్‌ఏలుగా గెలిచినట్టు ప్రకటించడానికీ, సర్టిఫికెట్ ఇవ్వడానికీ అధికారులు నిరాకరించారు. అంటే 'పోస్ట్–పోలింగ్' రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. ఆ ఎన్నికలో గెలిచీ ఓడిపోయిన అమీరా కడల్ ఎంఎల్‌ఏ సయ్యద్ సలాహుద్దీన్ పాకిస్తాన్‌కు పోయి తుపాకులు తెచ్చుకొని హిజ్బుల్ ముజాహిదీన్‌ను ప్రారంభించాడు. 1987లో అధికారికంగా జరిగిన రిగ్గింగే అప్పటి వరకు శాంతియుతంగా వ్యక్తమైన కాశ్మీరీల జాతీయ ఆకాంక్షను మిలిటెంట్ బాటలోకి తీసుకుపోయిందని మినహాయింపు లేకుండా అందరూ ఒప్పుకుంటారు.


**కాశ్మీరీలు ఎన్నికలలో పాల్గొంటున్నారంటే భారత రాజ్యాంగాన్ని ఆమోదించినట్టేనని భారత ప్రభుత్వం వ్యాఖ్యానిస్తున్నది. అటువంటి వ్యాఖ్యలు వస్తాయని తెలుసును కాబట్టే తాము ఎన్నికలలో పాల్గొనడానికి గల అర్థం అదికాదని వారు స్పష్టం చేశారు.**

భారత ప్రభుత్వం తప్ప కాశ్మీరీలకొక జాతీయ ఆకాంక్ష ఉందనిగానీ దానిని ఢిల్లీ పాలకులు పదే పదే అగౌరవపరిచారని గానీ మన వాళ్ళెప్పుడూ ఒప్పుకోలేదు. మిలిటెన్సీ అంతా 'పాక్ – ప్రేరేపితం' అంటూ వచ్చారు. 1990 తరువాత అమెరికా ప్రపంచ ప్రభుత్వంగా అవతరించడంతో పరిస్థితి మారింది. అప్పటివరకు అమెరికా ఏది తలపెట్టినా రష్యా అడ్డుపడేది. రష్యా ఏది తలపెట్టినా అమెరికా అడ్డుపడేది. మన వాళ్ళు రష్యా గొడుగుకింద, పాకిస్తాన్ అమెరికా గొడుగుకింద చేరి కాశ్మీర్ సమస్యను పరిష్కరించకుండా కాలక్షేపం చేయగలిగారు. అయితే అమెరికా ప్రపంచాధిపత్యాన్ని చేజిక్కించుకున్న తరువాత, తనకు శాంతి కావాలసిన అన్ని ప్రాంతాలలోనూ శాంతిని న్యాయంగానో, అన్యాయంగానో నెలకొల్పే పని భుజాన వేసుకుంది, ఏ కారణంగానైతేనేం కాశ్మీర్ అటువంటి ప్రాంతాలలో ఒకటి.

రష్యా బలం పోయిందే అని ఢిల్లీ పాలకులు పెద్దగా బాధపడలేదు. రెండు కారణాలుగా పాకిస్తాన్ కంటే ఇండియాయే అమెరికాకు దగ్గర కాగలదనుకున్నారు. ఒకటి, అమెరికా ఆర్థిక ప్రయోజనాలకు పాకిస్తాన్ కంటే భారత్ ఎక్కువ తోడ్పడగలుగుతుంది. రెండు, అన్ని పాశ్చాత్య దేశాలలాగే అమెరికాకు కూడా 'ముస్లిం తీవ్రవాదం' అంటే చచ్చే భయం.

ఈ రెండు కారణాలనూ ఆసరా చేసుకుని కాశ్మీర్‌లో శాంతి భారత్ ప్రయోజనాల ప్రాతిపదికన నెలకొల్పడమే అమెరికాకు మంచిదని మన వాళ్ళు అమెరికాకు అనేక విధాల నచ్చజెప్ప బూనుకున్నారు. అమెరికా చేత పాకిస్తాన్ పైన ఒత్తిడి పెట్టించి కాశ్మీరీ మిలిటెన్సీకి పాకిస్తాన్ సహాయం అందియ్యడం ఆపించగలిగితే, ఇక శాశ్వతంగా కాశ్మీర్‌ను భారత్‌లోనే ఉంచేసుకోవచ్చునని ఆశించారు. సెప్టెంబర్ 11 తరువాత 'ముస్లిం తీవ్రవాదం' పట్ల అమెరికన్ల భయం విపరీతంగా పెరగడం తమ వ్యూహానికి చాలా అనుకూల విషయంగా మన పాలకులు భావించారు.

ఆ తరువాత మన వాళ్ళు పాకిస్తాన్‌పైన ఒత్తిడి విపరీతంగా పెంచారు. సమయం, సందర్భం లేకుండా పాకిస్తాన్‌ను ఎద్దేవా చేయడం, పాకిస్తాన్‌ను ఏకాకిని చేస్తామని ప్రకటించడం మొదలుపెట్టారు. సైన్యాన్ని సరిహద్దు దగ్గర మోహరించి, 'సీమాంతర ఉగ్రవాదాన్ని' పాకిస్తాన్ ఆపకపోతే యుద్ధం తప్పదన్న బెదిరింపులు జారీ చేశారు. ఈ రెండు దేశాల మధ్య యుద్ధం ప్రస్తుత పరిస్థితులలో అమెరికాకు ఇష్టం ఉండదు కాబట్టి అమెరికా పాకిస్తాన్‌పైన ఒత్తిడి పెంచుతుందనీ, కాశ్మీర్‌లో మిలిటెంట్లకు పాకిస్తాన్ ఇచ్చే సహాయ సహకారాలు (అదే, 'సీమాంతర ఉగ్రవాదం') తగ్గుతాయనీ, అల్ ఖైదా సందడి సద్దుమణిగే లోపల కాశ్మీర్ సమస్యను ఢిల్లీ ప్రయోజనాలకు అనుకూలంగా పరిష్కరించేసుకోవచ్చుననీ ఆశించారు.



**ఒక దేశ ప్రధాన మంత్రి 'ఫలానా రాష్ట్రంలో ఈసారి ఎన్నికలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా జరుపుతాం' అనడం ఏమిటి? ఎన్నికలు స్వేచ్ఛగా స్వతంత్రంగా కాకపోతే ఇంకే విధంగా జరుపుతారు?**

అయితే ఇక్కడొక ట్రాప్ ఉందని మన వాళ్ళకు అర్థం కానట్టుంది. లేకపోతే దానికి కూడా ఒక ఎత్తుగడ ఆలోచించి పెట్టుకున్నారో. 'పాకిస్తాన్‌ను మీరు ఆపకపోతే మేము యుద్ధానికి దిగుతాం' అన్న బెదిరింపు పని చేయక తప్పదు. పనిచేసింది. అమెరికా ఒత్తిడి మేరకు సరిహద్దు దగ్గర మిలిటెంట్ల చొరబాటు నిజంగానే తగ్గింది. దానిని పూర్తిగా ఆపడానికి కావలసినంత పటిష్టమైన పాలనాధికారం పాకిస్తాన్‌లో లేదని అందరికీ తెలుసును. కాబట్టి ఒక స్థాయి దాటి ముషార్రఫ్ ఆ చొరబాటును నిలువరించలేకపోయినందుకు అతనిని ఇండియా తప్ప వేరే ఎవరూ తప్పుపట్టడం లేదు. నిజానికి ముషార్రఫ్‌కు రాజకీయంగా సాధ్యం అయి ఉంటే అతను ఇంకా తెలివిగా తప్పించుకొని ఉండవచ్చును. కాశ్మీరీలు కాని పాకిస్తాన్ మిలిటెంట్లను బుజ్జగించో బుదగరించో ఇండియాలోని కాశ్మీర్‌లోకి చొరబడకుండా ఆపి, కాశ్మీరీ పాకిస్తానీలను మాత్రం యధేచ్ఛగా పోనిచ్చి, 'కాశ్మీరీ పోరాటంలో పాల్గొనడానికి పోతున్న కాశ్మీరీలను నేనెట్లా ఆపగలను?' అని ఉంటే మనం తప్ప ప్రపంచమంతా అవుననేది. ఎందుకంటే – మన పత్రికలు ఈ విషయాన్ని ఎంత జాగ్రత్తగా దాచిపెట్టినా – ఒక్క భారత్ తప్ప తక్కిన ప్రపంచమంతా కాశ్మీర్‌లో జరుగుతున్న దాన్ని కాశ్మీరీల జాతి పోరాటంగానే భావిస్తున్నది.

అయితే ముషార్రఫ్‌కు ఈ విషయంలో స్వేచ్ఛ లేదు. కాశ్మీరీల జాతి పోరాటం కాశ్మీరీల స్వంత విషయం అని ప్రకటించడం పాకిస్తాన్ రాజకీయాలలో సాధ్యంకాదు. దానిని 1947 నాటి దేశ విభజన యొక్క ఆఖరి ఘట్టంగానే పాకిస్తాన్ రాజకీయాలలో చూపుతూ వచ్చారు. కాబట్టి ముషార్రఫ్ (ఎంతటి సైనిక నియంత అయినా) ఈ రోజు అది కాశ్మీరీల స్వంత పోరాటం కాబట్టి 'దానిలో పాల్గొనడానికి కాశ్మీరీలు పోతేపొండి, కానీ పంజాబీలూ సింధీలూ, బలూచీలూ, పష్తూలూ పోవద్దు' అన లేడు. అయితే బిగ్గరగా అనలేకపోయినా అతను అదే 'హింట్' పాశ్చాత్య దేశాలకు ఇచ్చాడు. వాళ్ళు అర్థం చేసుకున్నారు.

కాబట్టి పాకిస్తాన్ నుండి 'చొరబాట్లు' పూర్తిగా ఆగవనీ, అయినప్పటికీ ముషార్రఫ్ బాగా తగ్గించాడనీ అమెరికా వంటి దేశాలు నమ్ముతున్నాయి. కాబట్టి వాళ్ళిప్పుడు ముషార్రఫ్ మాట వినడానికి సిద్ధంగా ఉన్నారు. ముషార్రఫ్ ఒకటే మాట పదే పదే అంటున్నాడు. 'మీరంతా చొరబాట్లు తగ్గించమంటే తగ్గించాను, కానీ కాశ్మీరీల స్వాతంత్ర్య పోరాటం మాటేమిటి? దానిని భారత్ అణచి వేస్తుంటే మీరంతా చూస్తూ ఊరుకుంటారా? కాశ్మీరీల ఆకాంక్షలకు జవాబు చెప్పమని భారత్‌ను నిలదీయరా?' అని అమెరికానూ ఇతర దేశాలనూ అడుగుతున్నాడు.

ఈ ప్రశ్న మనకు తప్ప ప్రపంచంలో అందరికీ న్యాయమైనదిగానే తోస్తుంది. అమెరికా ఇండియాను ఇదే ప్రశ్న ప్రత్యక్షంగా, పరోక్షంగా అడుగుతున్నది. ఇప్పుడు మన పాలకులకు దాక్కోడానికి

'పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదం' అనే ఆచ్ఛాదన లేదు. ఒక దశాబ్దకాలంగా దాని వెనకే దాక్కున్నాం. కానీ ఆ పేరు మీద పాకిస్తాన్‌పైన, అమెరికాపైన విపరీతంగా ఒత్తిడి పెట్టి, యుద్ధమైనా చేయడానికి సిద్ధమేనని బెదిరించి అమెరికా సంతృప్తి చెందే మేరకు పాకిస్తాన్ చొరబాట్లను తగ్గించేటట్టు చేయగలిగాం.

> కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీ ప్రత్యేక జమ్మూ రాష్ట్రం డిమాండ్‌ను తిరస్కరించింది గానీ జమ్మూలోని బిజెపి లోపాయికారీగా ఆర్ఎస్ఎస్ వారి జమ్మూ రాష్ట్ర మోర్చాతో పొత్తు పెట్టుకుంది.


ఇప్పుడింక కాశ్మీరీల ఆకాంక్షలను ముఖాముఖి ఎదుర్కొనక తప్పేదేముంది? ఆ సంగతి మన పాలకులకు బాగా తెలుసు. పాకిస్తాన్ మీద విపరీతంగా ఒత్తిడి పెట్టి తాము తవ్వుకున్న గోతిలో తామే పడ్డామని తెలుసు. అందుకని అసెంబ్లీ ఎన్నికల పేరుమీద కొంత సమయం సమస్యను వాయిదా వేయగలిగారు. కాశ్మీర్‌లో ఎన్నికలు ఈసారి స్వేచ్ఛగా, స్వతంత్రంగా జరుపుతామనీ ఆ రకంగా కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత కాశ్మీర్ సమస్య పరిష్కారం గురించి ప్రయత్నం చేస్తామనీ కొన్ని నెలల కింద వాజ్‌పేయి ప్రకటించాడు.

భారత్‌లో కాశ్మీర్ చరిత్ర గురించి తెలియని వారు ఆ ప్రకటన చూసి ఆశ్చర్యపోయి ఉంటారు. ఒక దేశ ప్రధాన మంత్రి 'ఫలానా రాష్ట్రంలో ఈసారి ఎన్నికలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా జరుపుతాం' అనడం ఏమిటి? ఎన్నికలు స్వేచ్ఛగా స్వతంత్రంగా కాకపోతే ఇంకే విధంగా జరుపుతారు? నిజానికి యాభై ఏళ్ళుగా కాశ్మీరీలు ఆమాటే అంటున్నారు. ఇక్కడ ఎన్నికలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా జరగడంలేదని. వాళ్ళు అన్నప్పుడది 'పాకిస్తాన్ ప్రేరేపిత వేర్పాటువాద దుష్ప్రచారం' అయింది. మనం ఒప్పుకుంటే సత్యం అయింది. మరి ఇన్నాళ్ళూ మనం చెప్పిన అసత్యానికి ఏం పేరు పెడదాం? దేశభక్తి అందామా?

ఏమయితేనేం, ఇన్ని కారణాలున్నాయి గనకనే ఈసారి ఎన్నికలు భిన్నంగా జరిగాయి. లింగ్‌డో గారి కార్యదీక్షనూ, కార్యదక్షతనూ తక్కువ చేయనక్కరలేదుగానీ ఈ పరిస్థితే లేకపోతే అది 'దేశభక్తి'తో తలపడగలిగి ఉండేదా అంటే అనుమానమే.

ఎన్నికలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా జరిగాయంటే అర్థం సైన్యం ఒత్తిడీ, మిలిటెంట్ల ఒత్తిడీ, సర్కారీ మిలిటెంట్ల ఒత్తిడీ లేనేలేవని అర్థంకాదు. అన్నీ కూడా 1996తో పోలిస్తే తక్కువ స్థాయిలో ఉన్నాయిగానీ పూర్తిగా లేకపోలేదు. ఓటర్లకు డబ్బులివ్వడం, బెదిరించడం, దొంగవోట్లు వేసుకోవడం జరగనే లేదనీ కాదు. ఇక్కడా, అక్కడా జరిగే ఉంటాయి. పాలక పార్టీ లేక ఢిల్లీ ఆమోదముద్ర పొందిన పార్టీ తన ఇష్టానుసారం ఎన్నికల ప్రక్రియను గతంలో లాగా మలచుకోలేక పోయిందన్న అర్థంలోనే స్వేచ్ఛ, స్వతంత్రం అన్న మాటలు వాడుతున్నారు. ఆ అర్థంలో ఈసారి ఎన్నికలు భిన్నంగా జరిగాయని కాశ్మీరీలంతా ఒప్పుకుంటున్నారు.

ఈ సంగతి ముందే అర్థమయింది కాబట్టి అనేక స్థానిక సమస్యలు ఎన్నికల ప్రక్రియలో భాగమయ్యాయి. విద్యావంతులలో నిరుద్యోగం కాశ్మీర్‌లో ఎక్కడకు పోయినా ప్రజలు ప్రస్తావించే ముఖ్యమైన సమస్య. అభివృద్ధి కోసమని చెప్పి ఆ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం కుమ్మరిస్తున్న డబ్బంతా కేంద్రానికి అనుకూలంగా ఉండే రాజకీయ నాయకులు, పౌరప్రముఖుల బ్యాంక్ ఖాతాలలోకి పోయింది. నిరుద్యోగంతో పాటు విద్య, వైద్యం, తాగునీరు, రహదార్లు మొదలైన కనీస వసతుల లేమి కాశ్మీర్‌లో చాలా బాధాకరమైన పరిమాణంలో ఉన్న సమస్య. ఈ రోజు ముఖ్యమంత్రి పదవికి పోటీపడుతున్న గులాం నబీ ఆజాద్ స్వస్థలం దోడా జిల్లాలోని మారుమూల ప్రాంతం. పీర్ పంజల్ కొండ చరియల వెంబడి ఉన్న ఈ ప్రాంతంలో అనేక గ్రామాల ప్రజలు బస్సు ప్రయాణించగల రోడ్డు చేరుకోవాలంటే కొండల వెంబడి అయిదారు గంటలు నడవాలి. స్కూలు పిల్లలు అట్లాగే స్కూలుకు పోయి రావాలి. కూలికిపోయే స్త్రీలూ, పురుషులూ అట్లాగే పోయి రావాలి.



> భయంకరమైన అణచివేత కింద నలుగుతున్న కాశ్మీరీల మానవ హక్కులను 'ప్రధాన స్రవంతి' రాజకీయ అజెండా మీదికి తీసుకొచ్చిన ఘనత పిడిపి సిట్టింగ్ ఎమ్మెల్యే మెహబూబాకే దక్కుతుంది

ఈ విషయాలలో ఫరూఖ్ అబ్దుల్లా ప్రభుత్వం ఏమీ చేయలేదన్న నిరసన చాలా విస్తృతంగా ఉంది. మిలిటెన్సీ మీద పోరాటం చేయడానికే తన సమయమంతా సరిపోతున్నదన్న సాకుతో ఫరూఖ్ అబ్దుల్లా సాధారణ పరిపాలన కూడా ప్రజలకు అందియ్యక పోవడం పట్ల ఉన్న నిరసన, ఎన్నికలలో నేషనల్ కాన్ఫరెన్స్ ఆటలు సాగవని అర్థం కాగానే, పాలక పార్టీ పట్ల బలమైన వ్యతిరేకతగా ముందుకు వచ్చింది.

అయితే ప్రాంతీయ అసమానతల సమస్య కూడా ఎన్నికలలో ప్రతిధ్వనించింది. జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో స్థూలంగా మూడు ప్రాంతాలున్నాయి, అవి జమ్మూ, కాశ్మీర్, లడక్. స్వయం నిర్ణయాధికారం లేక స్వాతంత్ర్యం కావాలన్న ఆకాంక్ష కాశ్మీర్‌కు, జమ్మూలోని కాశ్మీరీలు నివసించే దోడా జిల్లాకు పరిమితం అయినది. అదే ప్రధానంగా దేశం దృష్టిని ఆకర్షిస్తుందని, ఇతర ప్రాంతాల సమస్యలు ఎవరూ పట్టించుకోరనీ నిరసన జమ్మూ, లడఖ్ ప్రాంతాలలో చాలా ఉంది. మూడు ప్రాంతాలలోకీ కాశ్మీర్ జనాభా రీత్యా పెద్దది, రాజకీయంగా ప్రముఖమైనది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, కేబినెట్‌లో మెజారిటీ ఎప్పుడూ కాశ్మీరీలే. కేంద్రం నుండి వచ్చిన నిధులు ఎక్కువగా కాశ్మీర్‌లోనే ఖర్చుపెట్టారనీ అభివృద్ధి మొత్తం అక్కడే జరిగిందనీ జమ్మూవాసుల అభియోగం. దీనిలోని నిజానిజాల విషయంలో జమ్మూవాసులలోనే ఏకాభిప్రాయం లేకపోయినప్పటికీ ఈ నిరసన ఉన్న మాట వాస్తవం. ఈ నిరసనను సొమ్ము చేసుకోవడానికి, జమ్మూకు వేరే రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలన్న డిమాండ్‌తో ఆర్ఎస్ఎస్ జమ్మూ రాష్ట్ర మోర్చా అనే సంస్థను ఈ మధ్యనే ప్రారంభించి ఎన్నికల బరిలో దింపింది. కాశ్మీరీలు అత్యధిక భాగం ముస్లింలు, జమ్మూలో మెజారిటీ హిందువులు కావడంతో ఈ 'ప్రాంతీయ వివక్ష' అన్న నిందకు మతం రంగు పూయడం సులభం అయింది. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రత్యేక జమ్మూ రాష్ట్రం డిమాండ్‌ను తిరస్కరించింది గానీ జమ్మూలోని బిజెపి లోపాయికారీగా ఆర్ఎస్ఎస్ వారి జమ్మూ రాష్ట్ర మోర్చాతో పొత్తు పెట్టుకుంది. దాని ఫలితమేమిటంటే అంతకు ముందు జమ్మూ ప్రాంతంలో 8 సీట్లు గెలిచిన బిజెపి ఈ సారి ఒక్క సీటు మాత్రమే గెలిచింది! మరి జమ్మూలోని హిందువులకు సహితం ఈ సంకుచిత మతతత్వ రాజకీయాలు నచ్చలేదనుకోవాలో, లేకపోతే గతంలో ముస్లింలు సహితం జమ్మూ ప్రాంతంలో బిజెపికి ఓటు వేసారనీ ఇప్పుడు ప్రత్యక్షంగా మతతత్వ రాజకీయాల రంగు పూసుకునేసరికి వేయలేదనీ అనుకోవాలో


చెప్పలేము.

జమ్మూలో మతతత్వం రంగు పూసుకున్న ప్రాంతీయ రాజకీయాలు ఓడిపోగా, లడఖ్‌లో ప్రాంతీయ రాజకీయాలు అన్ని మతాల వారినీ కలుపుకొని అన్ని సీట్లూ గెలుచుకోవడంలో కృతకృత్యమయ్యాయి. నిజానికి లడఖ్ వాసులది చాలా బాధాకరమైన పరిస్థితి. లడఖ్ ఎత్తయిన శీతల ఎడారి. అక్కడి ప్రజల భాషా సంస్కృతులకు కాశ్మీరీలతో గానీ, జమ్మూ ప్రాంత వాసులైన డోగ్రీ ప్రజలతో గానీ ఏమీ సంబంధంలేదు. వారికి సాన్నిహిత్యం టిబెట్‌తో. అయితే ఇక్కడి నేలలు సారవిహీనమైనవి, వాతావరణం అత్యంత శీతలమైనది కావడంతో జనాభా చాలా తక్కువ. పైగా లడఖీలలో దాదాపు సగభాగం బౌద్ధులుకాగా, సగభాగం షియా ముస్లింలు. ఇవి రెండూ దేశ రాజకీయాలలో బలంలేని మతాలే.

> ఈ రోజు ముఖ్యమంత్రి పదవికి పోటీపడుతున్న గులాం నబీ ఆజాద్ స్వస్థలం దోడా జిల్లాలోని మారుమూల ప్రాంతం. ఈ ప్రాంతంలో అనేక గ్రామాల ప్రజలు బస్సు ప్రయాణించగల రోడ్డు చేరుకోవాలంటే కొండల వెంబడి అయిదారు గంటలు నడవాలి.

ఈ కారణాలన్నిటివల్లా లడఖీల గొంతు జమ్మూ కాశ్మీర్ రాజకీయాలలో అసలే వినబడదు. కొన్ని ఏళ్ళ కింద లడక్ ప్రాంతంలో స్వయంప్రతిపత్తి గల స్థానిక హిల్ కౌన్సిల్ ఏర్పాటు చేసే ప్రక్రియ మొదలయింది. అయితే లడఖ్‌లోని రెండు జిల్లాలలో దక్షిణ జిల్లా అయిన 'లే'లో హిల్ కౌన్సిల్ మొదట ఏర్పడింది. 'లే' బౌద్ధులు అధికంగా నివసించే ప్రాంతం. షియా ముస్లింలు అధికంగా నివసించే కార్గిల్ జిల్లాలో హిల్ కౌన్సిల్ ఇప్పటికీ ఏర్పడలేదు. ఇది భాషా సంస్కృతులలో ఒకటైన ప్రజలను మతం ప్రాతిపదికన చీల్చే ప్రక్రియ అన్న విమర్శ బలంగా వచ్చింది. అదెట్లాగున్నా, ఈసారి ఎన్నికల ప్రక్రియ మొదలయ్యేసరికి మొత్తంగానే లడఖ్‌ను జమ్మూకాశ్మీర్ నుండి వేరు చేసి కేంద్ర పాలిత ప్రాంతంగా పునర్వ్యవస్థీకరించాలన్న డిమాండ్‌తో ఒక వేదిక ఏర్పడింది. అది 'లే' ప్రాంతంలో అన్ని మతాల వారి మద్దతూ పొందింది. కార్గిల్ ప్రాంతంలో అన్ని మతాల వారి డిమాండ్‌తో హిల్ కౌన్సిల్ ఏర్పాటును కేంద్రం చేసుకున్న వేదిక ఏర్పడింది. ఈ రెండు వేదికల తరపున పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థులు లడఖ్‌లో నేషనల్ కాన్ఫరెన్స్‌ను నామరూపాలు లేకుండా చేశారు.

ఇంక కాశ్మీర్ లోయ విషయానికి వచ్చేసరికి, ఈసారి ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ అక్రమాలకు పాల్పడే అవకాశాలు లేవని అర్థమయ్యే సరికి ఎట్లాగైనా నేషనల్ కాన్ఫరెన్స్‌ను ఓడించాలన్న సంకల్పం ఎన్నికల ప్రచార సమయంలోనే బలంగా వ్యక్తం అయింది. ఈ సంకల్పాన్ని ప్రకటించిన వారందరూ ఒక విషయాన్ని స్పష్టం చేశారు. కాశ్మీర్‌కు 'ఆజాదీ' కావాలన్న ఆకాంక్షను తాము వదులుకోలేదనీ, అయితే ఈ ఎన్నికలలో పాల్గొనడానికీ, దానికీ ఏమీ వైరుధ్యం లేదనీ శ్రీనగర్‌లో గద్దెను శాశ్వతంగా ఆక్రమించుకొని ఇష్టారాజ్యంగా పరిపాలిస్తున్న అబ్దుల్లా కుటుంబానికి బుద్ధి చెప్పడం తమ తక్షణ లక్ష్యం అనీ అన్నారు. మరికొందరు, ఆజాదీ తమ అంతిమ లక్ష్యమైనప్పటికీ ప్రస్తుతానికి కూడు, గుడ్డ ఇవ్వగల ప్రభుత్వం కోసం ఓటు వేస్తున్నామనీ దీనిని వేరే విధంగా వ్యాఖ్యానించకూడదనీ అన్నారు. ఈ వ్యాఖ్యలు వాళ్ళు చేయడానికొక కారణం ఉంది. కాశ్మీరీలు ఎన్నికలలో పాల్గొంటున్నారంటే భారత రాజ్యాంగాన్ని ఆమోదించినట్టే నని భారత ప్రభుత్వం మొదటి నుంచీ వ్యాఖ్యానిస్తున్నది. మొన్నటి ఎన్నికల తరువాత కూడా అదే వ్యాఖ్య



చేసింది. అటువంటి వ్యాఖ్యలు ఢిల్లీ నుండి వస్తాయని కాశ్మీరీలకు తెలుసును కాబట్టే తాము ఎన్నికలలో పాల్గొనడానికి గల అర్థం అది కాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్, పిడిపి నాయకులు కూడా అదే హెచ్చరిక ఢిల్లీ ప్రభుత్వానికి చేశారు. ఎన్నికలు జయప్రదంగా జరపడంతో ఏమీ అయిపోలేదనీ, అసలు సమస్య పరిష్కారం ముందుందనీ ముఫ్తీ మహమ్మద్ సయీద్, గులాం నబీ ఆజాద్‌లు ఇద్దరూ అన్నారు.

> పాకిస్తాన్ మీద విపరీతంగా ఒత్తిడి పెట్టి తాము తవ్వుకున్న గోతిలో తామే పడ్డామని తెలుసు. అందుకని అసెంబ్లీ ఎన్నికల పేరు మీద కొంత సమయం సమస్యను వాయిదా వేయగలిగారు.

ఎన్నికలలో చాలా మంది స్వతంత్ర అభ్యర్థులు గెలిచారు. వారిలో ఒకరిద్దరు 'తిరుగుబాటు' అభ్యర్థులను మినహాయిస్తే తక్కిన వారందరూ 'ఆజాదీ' కాముకులే. ఏదో ఒక మిలిటెంట్ సంస్థ సపోర్టు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉన్నవారే. ఎన్నికలను బహిష్కరించడం కంటే పాల్గొని ఫరూఖ్ అబ్దుల్లా కుటుంబానికి బుద్ధి చెప్పడం సరైన వైఖరి అని నమ్మేవారు కాశ్మీర్‌లో చాలా మందే ఉన్నారనడానికి వీరి ఎన్నిక ఒక సూచిక.

అయితే మిలిటెన్సీకి ప్రధాన కేంద్రాలైన శ్రీనగర్, బారాముల్లా, సోపోర్, అనంత్‌నాగ్ పట్టణాలలో పోలింగ్ చాలా తక్కువ ఉండడాన్ని బట్టి చూస్తే ఎన్నికలలో పాల్గొని నేషనల్ కాన్ఫరెన్స్‌ను ఓడించడం అన్న ఆలోచనకంటే బాయ్‌కాట్ చేయాలన్న ఆలోచనే మిలిటెన్సీ ప్రభావం ఎక్కువ ఉన్న ప్రాంతాలలో బలంగా ఉందని అర్థం అవుతుంది, కాశ్మీర్‌లో వేర్పాటువాదం ప్రభావం గ్రామాలలో కంటే పట్టణాలలో బాగా ఎక్కువ. అందులోనూ శ్రీనగర్ 'డౌన్ టౌన్' (పాతబస్తీ) వేర్పాటువాదానికి ప్రధాన కేంద్రం. ఆ ప్రాంతాలలో నూటికి పది మంది కూడా ఓటు వేయలేదంటే 'సమస్య' ఎన్నికలు జరపడంతో తీరిపోయిందనుకోవడం భ్రమ.

ఎన్నికలు దండగ అనుకోని వారినందరినీ ఆకర్షించిన విషయం కాశ్మీర్ లోయలో పిడిపి విజయం. దీనికి ప్రధాన కారణం ఆ పార్టీ సిట్టింగ్ ఎంఎల్‌ఏ మెహబూబా ముఫ్తీ రాజకీయ కార్యాచరణ అనడంలో సందేహం లేదు. భయంకరమైన అణచివేత కింద నలుగుతున్న కాశ్మీరీల మానవ హక్కులను 'ప్రధాన స్రవంతి' రాజకీయ అజెండా మీదికి తీసుకొచ్చిన ఘనత ఈమెకే దక్కుతుంది. 'నేను ఇండియన్‌నే. కాశ్మీర్ భారత్‌లో ఉండాలనే కోరుకుంటాను. కానీ ఈ అభిప్రాయంతో విభేదించే వారిని నేరస్తులుగా, దేశద్రోహులుగా చూసి అణచివేయాలని ప్రయత్నించడం అన్యాయం. వాళ్ళతో మాట్లాడాలి. మాట్లాడి సమస్యను పరిష్కరించాలి' అంటుందామె. కాశ్మీర్‌లో ఏ మూలనైనా సైన్యం చేత అత్యాచారాలకూ, హింసకూ గురైన ప్రజలను 'మిమ్మల్ని పలకరించడానికి ఎవరైనా వచ్చారా' అని అడిగితే హురియత్ కాన్ఫరెన్స్ పేరు చెప్తారు, మెహబూబా ముఫ్తీ పేరు చెప్తారు. ఆ కృషి ఫలితం పిడిపికి వచ్చిన సీట్లు.

అధికారం ఇప్పుడు ఎవరు చలాయించినా చలాయించి ఏం చేసినా కాశ్మీరీల భావాలను గౌరవించి వారితో మాట్లాడడానికీ అవసరమైతే పాకిస్తాన్‌తోనూ మాట్లాడడానికీ ఢిల్లీ పాలకులు సిద్ధపడితేనే కాశ్మీరీల పీడకల ముగింపుకు వస్తుంది. ఎన్నికల విజయవంతమైన నిర్వహణను అడ్డం పెట్టుకుని సమస్య పరిష్కారాన్ని ఇంకొంత కాలం వాయిదా వేయడానికి ఏ ఎత్తుగడలు వేద్దామా అని ఢిల్లీ పాలకులు ఆలోచించేటట్టయితే మాత్రం ఏమీ మారదు. పన్నెండేళ్ళలో దాదాపు 80 వేల మందిని పోగొట్టుకొని కూడా కాశ్మీరీలు తమ స్వాతంత్ర్య కాంక్షను వదులుకోలేదు. ఇంకెంత మందిని చంపితే వదులుకుంటారనుకోవడం భ్రమ.